సాక్షి
రంగారెడ్డి
గురువారం । 11 । జూలై । 2024



సమస్యలు పరిష్కరించాలి

భవన నిర్మాణ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రాంమోహన్‌రావు డిమాండ్‌ చేశారు. 10లో▸



రైతు భరోసాతో మేలు

రైతుభరోసా పథకం రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ఉపయుక్తంగా ఉంటుందని ఎం.రాజిరెడ్డి అన్నారు. 10లో▸



మద్యం బాటిళ్లు ధ్వంసం

ఎన్నికల సందర్భంగా బెల్టుషాపులు, ఫాంహౌస్‌లలో పట్టుకున్న మద్యం బాటిళ్లను పోలీసులు ధ్వంసం చేశారు. 10లో▸

న్యూస్‌రీల్‌

యూపీ బ్యాంక్‌ మేనేజర్ల బృందం పర్యటన

మహిళా సంఘాల పనితీరుపై ఆరా

నందిగామ: ఉత్తరప్రదేశ్‌కు చెందిన 35 మంది బ్యాంక్‌ మేనేజర్ల బృందం మహిళా సంఘాల పనితీరును తెలుసుకునేందుకు మండలంలో పర్యటించారు. ఈ మేరకు బుధవారం వారు జాతీయ జీవనోపాదుల మిషన్‌, పంచాయతీరాజ్‌ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో నందిగామ, మేకగూడ గ్రామాల మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడారు. సంఘాలు తీసుకునే రుణాలు, పనితీరు, చెల్లింపుల విధానం, ఉపాధి తదితర విషయాలను సంఘం సభ్యులను అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, బ్యాంకులు ఇస్తున్న సహకారం ఎల ఉంది.. స్వయం ఉపాధితో మహిళా సంఘాల ఆర్థిక స్థితిగతులు తెలుసుకుని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డీపీఎం స్వర్ణలత, ఏపీఎం యాదగిరి, సీసీలు అనురాధ, రజనీ, పలువురు మహిళా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వనమహోత్సవానికి సిద్ధంగా ఉండాలి

డీఆర్‌డీఓ శ్రీలత



చిలుకూరు మృగవని పార్కులో మాట్లాడుతున్న డీఆర్‌డీఓ శ్రీలత

మొయినాబాద్‌/మొయినాబాద్‌ రూరల్‌: వనమహోత్సవం కార్యక్రమానికి అందరూ సిద్ధంగా ఉండాలని రంగారెడ్డి జిల్లా డీఆర్‌డీఓ శ్రీలత అన్నారు. మండల పరిధిలోని చిలుకూరు మృగవని జాతీయ పార్కులో బుధవారం వనమహోత్సవంపై మొయినాబాద్‌, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల ఎంపీడీఓలు, పంచాయతీ అధికారులు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వనమహోత్సవం కార్యక్రమంలో మొక్కలు నాటేందుకు గుర్తించిన స్థలాల్లో శాస్త్రీయ పద్ధతిలో గుంతలు తీయాలని చెప్పారు. నాటిన మొక్కలు ఎండిపోకుండా ఉండాలంటే శాస్త్రీయ పద్ధతిని అవలంబించాలన్నారు. గ్రామాల్లో అనువైన స్థలాలను గుర్తించి మొక్కలు నాటేందుకు గుంతలు తీయించాలన్నారు. అనంతరం ఆమె కనకమామిడి నర్సరీని పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్‌ డీఆర్‌డీఓ సుభాషిణి, ఎఫ్‌ఆర్‌ఓ ప్రతిమ, ఎంపీడీఓలు సంధ్య, హిమబిందు, వెంకన్న, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యశాఖ జిల్లా అధికారి సుకీర్తిపై వేటు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మత్స్యశాఖ జిల్లా అధికారి సుకీర్తి సస్పెన్షన్‌కు గురయ్యారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం, అక్రమ వసూళ్ల ఆరోపణల నేపథ్యంలో ఆమెపై వేటు పడింది. ఆమె స్థానంలో హైదరాబాద్‌ జిల్లా మత్స్యశాఖ అధికారి ఎం.చరితకు బాధ్యతలు అప్పగిస్తూ బుధవారం మత్స్యశాఖ సంచాలకులు ఆదేశాలు జారీ చేశారు. మత్స్యకారుల సొసైటీల్లో సభ్యత్వం జారీ, మత్స్యకారులకు ప్రభుత్వం మంజూరు చేసిన వాహనాలు, ఇతర సంక్షేమ పథకాల్లో ఆమె అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణల నేపథ్యంలో మత్స్యశాఖ విచారణ చేపట్టింది. ప్రైవేటు వ్యక్తుల నుంచి ఫర్నీచర్‌ కొనుగోలు చేయించినట్లు తేలింది. ప్రభుత్వ నిధులను సైతం పక్కదారి పట్టించినట్లు తేలడంతో సస్పెన్షన్‌ వేటు పడింది.

రేపు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

శంషాబాద్‌లో ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి

సాక్షి, రంగారెడ్డి జిల్లా: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలకు రంగారెడ్డి జిల్లా వేదిక కాబోతోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం ఉదయం 10 గంటలకు శంషాబాద్‌లోని మల్లిక కన్వెన్షన్‌లో నిర్వహించే ఈ సమావేశాలకు కేంద్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ సహా ఎంపీలు ఈటల రాజేందర్‌, ధర్మపురి అరవింద్‌, డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, పార్టీ ఎమ్మెల్యేలు, వివిధ విభాగాల ప్రముఖులంతా హాజరుకానున్నారు. 2029లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన శంషాబాద్‌లో పర్యటించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆయనతో వెంట పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వీరేందర్‌ గౌడ్‌, రాష్ట్ర నాయకులు కొప్పు బాషా, డీఆర్‌ ప్రేమ్‌రాజ్‌ యాదవ్‌, అంజన్‌ కుమార్‌ గౌడ్‌, మల్లారెడ్డి, వై.శ్రీధర్‌, యాదయ్య గౌడ్‌, పగడాల శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

చెరువుల విముక్తికి శాటిలైట్‌ సర్వే

- ఆధునిక సాంకేతికతతో చెరువుల హద్దులు, ఎఫ్‌టీఎల్‌ నిర్ధారణ
- ఆక్రమణల తొలగింపునకు రెండు టాస్క్‌ఫోర్స్‌ బృందాలు
- జోన్‌–1 పరిధిలో ఎల్బీనగర్‌, మహేశ్వరం, ఇబ్రహీంపట్నం
- రెండో జోన్‌లో రాజేంద్రనగర్‌, శేరలింగంపల్లి, షాద్‌నగర్‌, చేవెళ్ల



సాక్షి, రంగారెడ్డి జిల్లా: ఆక్రమణదారుల గుప్పిట్లో బందీగా ఉన్న చెరువులు, కుంటలకు విముక్తి కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధమైంది. శాటిలైట్‌ ద్వారా జిల్లాలోని జలవనరులకు సర్వే చేపట్టి.. చెరువుల విస్తీర్ణం, ఫుల్‌ ట్యాంక్‌ లెవల్‌(ఎఫ్‌టీఎల్‌), బఫర్‌ జోన్లను నిర్ధారించనుంది. దీంతో పాటుగా ఆక్రమణలను గుర్తించి, వాటిని యుద్ధ ప్రాతిపదికన తొలగించేందుకు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు రెండు రోజుల క్రితం కలెక్టర్‌ శశాంక రెవెన్యూ, నీటి పారుదల శాఖ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. జిల్లాలోని చెరువులు, కుంటలపై ఆరా తీశారు. ఈ ఆక్రమణల తొలగింపు, హద్దుల గుర్తింపు కోసం స్పెషల్‌ డిప్యూటీ కలెక్టర్‌, ఏసీపీ స్థాయి అధికారి పర్యవేక్షణలో రెండు ప్రత్యేక టాస్క్‌ ఫోర్స్‌ బృందాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ బృందంలో రెవెన్యూ, పోలీస్‌, ఇరిగేషన్‌, మున్సిపల్‌ కమిషనర్‌, హెచ్‌ఎండీఏ లేక్స్‌, పంచాయతీ, విద్యుత్‌, సర్వే సిబ్బంది సభ్యులుగా ఉండనున్నారు. ఈ బృందం ఒక్కో రోజు ఒక్కో చెరువును పరిశీలించనుంది.

రెండు జోన్లు.. రెండు బృందాలు

అధికారులు జిల్లాలోని చెరువులను రెండు జోన్లుగా విభజించారు. ఎల్బీనగర్‌, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల్లోని చెరువులు, కుంటలను ఒక జోన్‌గా, రాజేంద్రనగర్‌, శేరిలింగంపల్లి, షాద్‌నగర్‌, చేవెళ్లలోని జలవనరులను మరో జోన్‌గా విభజించారు. వీటి పరిరక్షణ కోసం డిప్యూటీ కలెక్టర్‌, ఏసీపీల ఆధ్వర్యంలో రెండు టాస్క్‌ఫోర్స్‌ బృందాలను ఏర్పాటు చేయనున్నారు. ప్రజావాణి సహా సాధారణ సమయాల్లో అందిన ఫిర్యాదుల ఆధారంగా చెరువులను తనిఖీ చేయనున్నారు. స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్‌, మున్సిపల్‌, పంచాయతీ, పోలీసు అధికారుల సాయంతో ప్రభుత్వ భూములు, ఎఫ్‌టీఎల్‌, బఫర్‌ ఏరియాపై జరిగిన ఆక్రమణలు టాస్క్‌ఫోర్స్‌ బృందాల పరిధిలో భౌతిక తనిఖీ నిర్వహించి, అన్ని రకాల అక్రమ నిర్మాణాలను అరికట్టేందుకు అవసరమైన చర్యలను చేపట్టనున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాల్సి వస్తుందని కలెక్టర్‌ శశాంక హెచ్చరికలు జారీ చేశారు.

ఆనవాళ్లు కోల్పోయిన చెరువులు

- జిల్లా వ్యాప్తంగా 2,132 చెరువులు, కుంటలుండగా, వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. మెజార్టీ చెరువులు అవుటర్‌కు అటు, ఇటుగా విస్తరించి ఉండటం, ఇక్కడ భూముల ధరలకు రెక్కలు రావడంతో కబ్జాదారుల కళ్లు ఈ చెరువులపై పడ్డాయి. ఆక్రమణ దారులు అడిగిందే తడవుగా ఎఫ్‌టీఎల్‌, బఫర్‌జోన్‌ వంటి అంశాలు పరిశీలించకుండానే ఇరిగేషన్‌ అధికారులు ఎన్‌ఓసీలు, హెచ్‌ఎండీఏ అధికారులు ఎల్పీ నంబర్లు జారీ చేస్తుండటంతో ఇప్పటికే ఎన్నో చెరువులు వాటి ఆనవాళ్లు కోల్పోయాయి.
- మీర్‌పేట్‌ సర్వే నంబర్‌ 148లోని 59.30 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న మంత్రాల చెరువు ప్రస్తుతం 33 ఎకరాలకు కుంచించుకుపోయింది. సర్వే నంబర్‌ 131లో 35 ఎకరాల విస్తీర్ణంలోని తాళ్లచెరువు పూర్తిగా కనుమరుగైంది. జిల్లెలగూడ సర్వే నంబర్లు 155, 179, 198, 101, 102లోని 30 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన సంజ చెరువు ప్రస్తుతం 12 ఎకరాలకు పరిమితమైంది. సర్వే నంబర్‌ 61లో 70 ఎకరాల పెద్ద చెరువు ఇప్పటికే 42 ఎకరాలకుపైగా ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోయింది.
- బాలాపూర్‌ సర్వే నంబర్‌ 184లోని 39 ఎకరాల్లో విస్తరించిన గుర్రంచెరువులో 24 ఎకరాలు ఆక్రమణకు గురైంది. సర్వే నెంబర్లు 127, 128,/1, 128/2లోని 16.16 ఎకరాల (ఎఫ్‌టీఎల్‌ పరిధిలో 33.20 ఎకరాలు) పెద్ద చెరువు 15 ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది. సర్వే నెంబర్లు 188, 189, 190లోని 37.34 ఎకరాల్లోని బురాన్‌ఖాన్‌ చెరువు (వెంకటాపూర్‌) ప్రస్తుతం ఏడు ఎకరాలు మిగిలింది. సర్వే నంబర్‌ 160, 169, 161లోని 40.9 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఎర్రకుంటలో 32 ఎకరాలు మాయమైంది.
- బడంగ్‌పేట్‌లోని సర్వే నంబర్‌ 145లో 14.15 ఎకరాల విస్తీర్ణంలో ఉండాల్సిన కుర్లోనికుంట ప్రస్తుతం పది ఎకరాలే మిగిలింది. ఇదే మున్సిపాలిటీ పరిధిలోని కొత్తకుంట ఆనవాళ్లు కోల్పోయింది. కనీసం రికార్డులు కూడా లేవు. ఇక 267 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన జల్‌పల్లి చెరువులో ఇప్పటికే వంద ఎకరాలకుపైగా కబ్జాకు గురైంది.
- జల్‌పల్లి పెద్ద చెరువు కట్ట కింది భాగం (సర్వే నంబర్‌ 223)లోని నాలుగు ఎకరాలకు పైగా భూమి పేదల పేరుతో ఇప్పటి కే కబ్జాకు గురైంది. బాలాపూర్‌ మండలం మల్లాపూర్‌ రెవెన్యూ వెంకటాపూర్‌ సర్వే నంబర్‌ 273లో సుమారు 15 ఎకరాల విస్తీర్ణంలోని సుద్దమోనికుంట సగానికిపైగా కబ్జాకు గురైంది.
- గౌలిదొడ్డి సర్వే నంబర్‌ 71లోని 5.30ఎకరాల ఈద్గవానికుంట పూర్తిగా కనుమరుగైంది. హయత్‌నగర్‌, అబ్దుల్లాపూర్‌మెట్‌ మండలాలకు సరిహద్దు గ్రామంలో 6.23 ఎకరాల్లో విస్తరించిన హత్తిగూడ కుంట ఆనవాళ్లు లేకుండా పోయింది. కాటేదాన్‌లోని సర్వే నంబర్‌ 247లో 19.15 ఎకరాల మామిడికుంట(ఐదు ఎకరాలు) ఆక్రమణకు గురైంది. ఇదే ప్రాంతంలోని కీలకమైన అప్పాచెరువు 39 ఎకరాల్లో విస్తరించి ఉండగా, ప్రస్తుతం 12 ఎకరాలే మిగిలింది. బాబుల్‌రెడ్డి నగర్‌లోని 22 ఎకరాల నర్సబాయికుంటను పూర్తిగా మింగేశారు.
- తుర్కయంజాల్‌ మాసబ్‌ చెరువు శిఖం భూముల్లో ఇప్పటికే వెంచర్లు వెలిశాయి. గతేడాది కురిసిన ఏకధాటి వర్షాలకు భారీగా వరదనీరు చేరడంతో ఆక్రమణ దారులు ఏకంగా భారీ బండరాళ్లు, లారీల కొద్ది మట్టి పోసి చెరువు ఆనవాళ్లు లేకుడా చేశారు. స్థానికులు నెలల తరబడి ఆందోళనలు చేపట్టినా..పోసిన మట్టిలో పిడికెడు కూడా బయటికి ఎత్తిపోయలేదు. ప్రస్తుతం ప్రభుత్వం నియమించిన ఈ టాస్క్‌ఫోర్స్‌ బృందాలు ఆక్రమణల చెర నుంచి చెరువులను కాపాడాతాయా లేదో వేచి చూడాల్సిందే.



వనమహోత్సవ కార్యక్రమంలో మొక్క నాటి నీరుపోస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి, అదనపు కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌, చైర్‌పర్సన్‌ స్రవంతి

పర్యావరణ పరిరక్షణ ప్రధానం

- నాటిన మొక్కను బాధ్యతతో బతికించాలి
- వన మహోత్సవంలో ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం: పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఇబ్రహీంపట్నం మున్సిపల్‌ పరిధిలోని ఎన్‌ఆర్‌ఐ వెంచర్‌ పార్కు స్థలంలో అదనపు కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ కప్పరి స్రవంతి, వైస్‌ చైర్‌పర్సన్‌ మంగతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాటిన ప్రతీ మొక్క బతికించే బాధ్యత ఈ మున్సిపల్‌ కమిషనర్‌, సిబ్బందిపై ఉందన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఒకే రోజు కోటి మొక్కలు నాటినట్లు గొప్పలు చెప్పినా అందులో లక్ష మొక్కలు నాటిన దాఖలాలే కనిపించడంలేదన్నారు. గతంలో ప్రతీ మొక్కకు వెయ్యి నుంచి పన్నెండు వందలు ఖర్చు పెట్టి ప్రజాధనాన్ని వృథా చేసినట్లు లెక్కలు చెబుతున్నాయని.. ఇప్పుడు అలా జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజాధనాన్ని వృథా చేస్తే ఆ భారం మనపైనే పడుతుందన్నారు. అనంతరం అదనపు కలెక్టర్‌ ప్రతిమాసింగ్‌ మాట్లాడుతూ.. నాటిన ప్రతీ మొక్కను బాధ్యతతో పెంచాలన్నారు. విద్యార్థులు, యువత మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వాములు కావాలన్నారు. మానవమనుగడ సాగాలంటే పర్యావరణ పరిరక్షణ ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో సుమారు 700 మొక్కలు నాటారు. ఈ వనమహోత్సవంలో మున్సిపల్‌ కమిషనర్‌ రవీంద్రసాగర్‌, కౌన్సిలర్లు, మున్సిపల్‌ సిబ్బంది, విద్యార్థులు, కాంగ్రెస్‌ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

- డిజిటల్‌ క్లాస్‌లను క్రమం తప్పకుండా నిర్వహించాలి
- జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు



విద్యార్థులతో ఆంగ్ల అక్షరాలను చదివిస్తున్న డీఈఓ, ఎంఈఓ, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: ప్రభుత్వ ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు చక్కగా పాఠ్యాంశాలను బోధించాలని జిల్లా విద్యాధికారి సుశీంధర్‌రావు అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని వెల్జాల్‌ బాలికల, బాలుర ప్రాథమిక, ఉన్నత పాఠశాలతో పాటుగా చంద్రధనలో ప్రాథమిక, జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలను, మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాల ను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే కంపౌండ్‌ వాల్‌లో ఉన్నప్పుడు బాల, బాలికలకు ఉమ్మడి టైం టేబుల్‌ తయారు చేసుకుంటే ఉపాధ్యాయుల కొరత నివారించగలమన్నారు. క్రమం తప్పకుండా డిజిటల్‌ క్లాస్‌లు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఆయా పాఠశాలలో మౌలిక వసతులతో పాటు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంటల్లో తాజా కూరగాయాలను వాడాలన్నారు.శుచి,రుచి ఉండేలా చూడాలన్నారు.మెనూ పాటిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆహార పదార్థాల స్టాక్‌, నిల్వ తదితర రిజిస్టర్లు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో తెలుగు చదివించి నైపుణ్యాన్ని అంచనా వేశారు. వెల్జాల్‌ ప్రాథమిక పాఠశాల విద్యార్థులతో ఇంగ్లిష్‌ అక్షరమాల చదివించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సర్దార్‌నాయక్‌, ఆమనగల్లు, కడ్తాల్‌ నోడల్‌ అధికారులు పాండు, జంగయ్య, హెచ్‌ఎం నసీమ్‌ సుల్తానా,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రజాభవన్‌లో ఫార్మాసిటీ భూ బాధితులతో మాట్లాడుతున్న కోదండరెడ్డి, రంగారెడ్డి

బాధితులకు బాసటగా సర్కార్‌

- అప్పటి ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాలతో ఇబ్బందులు
- రైతులకు ఇచ్చిన మాటపైనే సీఎం
- ఫార్మాసిటీ రైతులతో ఎమ్మెల్యే రంగారెడ్డి, ముదిరెడ్డి కోదండరెడ్డి ముఖాముఖి

ఇబ్రహీంపట్నం: ఫార్మాసిటీ భూ బాధిత రైతులకు బాసటగా రేవంత్‌ సర్కార్‌ నిలుస్తుంది.. రైతులు ఆందోళన చెందొద్దని కిసాన్‌ సెల్‌ జాతీయ ఉపాధ్యక్షుడు, ధరణి కమిటీ సభ్యుడు ముదిరెడ్డి కోదండరెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం ఆయన ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి ఇబ్రహీంపట్నం ప్రజాపాలన భవన్‌లో (ఎమ్మెల్యే క్యాంపు ఆఫీస్‌) యాచారం మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లి, కుర్మిద్ద, తాడిపర్తి, నానక్‌నగర్‌ గ్రామాల ఫార్మాసిటీ భూ బాధితులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతుల సందేహాలను నివృత్తి చేసే యత్నం చేశారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనాలోచితంగా ఫార్మాసిటీ కోసం 19,393 ఎకరాల భూమిని సేకరించిందని.. ముందు నుంచి కాంగ్రెస్‌ పార్టీ వ్యతిరేకిస్తూ పోరాడిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌ అధికారంలోకి రావడంతో ఫార్మాసిటీ భూ బాధితులకు న్యాయం చేసే దిశగా రేవంత్‌రెడ్డి సర్కార్‌ ప్రయత్నిస్తుందని.. ఇందులో ఎలాంటి అనుమానాలకు తావులేదన్నారు. 2,500 ఎకరాలు అథారిటీ డిపార్టుమెంట్‌కు రిఫెర్‌ చేసినందున ఆ భూములు ఆన్‌లైన్‌ కాలేదని.. ఈ సమస్య పరిష్కారానికి చట్టపరమైన చిక్కులున్నాయని చెప్పారు. సంబంధిత మంత్రులు, అధికారులతో చర్చించి ఈ సమస్యను అధిగమిస్తామన్నారు. నగరానికి చేరువలో ఉన్న ఈ ప్రాంతంలో ఇకపై భూసేకరణ ఉండదని, సేకరించిన భూమిలో హెల్త్‌ హబ్‌, ఎడ్యుకేషన్‌ హబ్‌, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రత్యేక పథకాలు ప్రభుత్వ ప్రతిపాదనల్లో ఉన్నాయని వెల్లడించారు.

భూ సేకరణలో అవినీతి

ఫార్మాసిటీ భూసేకరణలో గత పాలకులు అవినీతికి పాల్పడ్డారని కోదండరెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. పలువురు అమాయక రైతులకు తక్కువ భూమిని నమోదు చేసి నష్టపరిహారం చెల్లించి మిగతా భూములను స్వాహా చేశారన్నారు. అప్పటి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. అసైన్డ్‌, భూదాన్‌, సీలింగ్‌ తదితర భూముల్లో కుంభకోణం జరిగిందని, అప్పటి ఆర్డీఓ సైతం పాలకులకు సహకరించాడని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రైతులను రెచ్చగొట్టే యత్నం

రేవంత్‌ సర్కార్‌ భూ బాధితులకు బాసటగా నిలుస్తుందని స్పష్టంగా ప్రకటించినా రైతులను రెచ్చగొట్టి పబ్బం గడుపుకోవాలని కొంతమంది యత్నిస్తున్నారని మండిపడ్డారు. అప్పటి పాలక పార్టీల నేతలు రియల్‌ ఎస్టేట్‌ ఏజెంట్లుగా మారి రైతుల భూములను కాజేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వాట్సాప్‌లో తప్పుడు సందేశాలు పంపుతూ.. రాజకీయ రాద్ధాంతం చేసేందుకు యత్నిస్తున్న వారికి సరైన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు.

ప్రాధేయపడి.. పనిలో చేరి

యజమానినే హతమార్చిన బాడీగార్డ్‌

- కమ్మదనం ఫాంహౌస్‌లో రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారి దారుణ హత్య
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన షాద్‌నగర్‌ ఏసీపీ



కృష్ణ (ఫైల్‌)

షాద్‌నగర్‌ రూరల్‌: కంటికి రెప్పలా కాపాడాల్సిన అంగరక్షకుడు యజమానిని గొంతు కోసి దారుణంగా హతమార్చాడు. ఈ ఘటన షాద్‌నగర్‌ పరిధిలోని కమ్మదనం గ్రామ శివారులోని ఓ హౌంస్‌లో బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. ఏసీపీ రంగస్వామి కథనం ప్రకారం.. కొన్నేళ్ల క్రితం బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ హైదర్‌షా కోటకు చెందిన కమ్మరి కృష్ణ అలియాస్‌ కేకే(60) షాద్‌నగర్‌ పరిధిలోని కమ్మదనం శివారులో పొలాన్ని కొనుగోలు చేసి ఫాంహౌస్‌ నిర్మించుకున్నారు. పావని అనే మహిళను రెండో వివాహం చేసుకున్న కృష్ణ ఆమెను ఫాంహౌస్‌లో ఉంచి అప్పుడప్పుడు వచ్చి వెళ్తుండేవాడు. వీరికి మూడేళ్ల పాప ఉంది. హైదరాబాద్‌ సన్‌సిటీలో నివాసముండే మొదటి భార్యకు ఇద్దరు కుమారులు.

గొంతు కోసి హత్య చేసి

రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తున్న కృష్ణ కొన్ని రోజుల క్రితం హైదరాబాద్‌కు చెందిన బాబా అనే వ్యక్తిని బాడీగార్డుగా నియమించుకున్నాడు. కృష్ణ ఎక్కడికి వెళ్లినా ఇతను వెంట ఉండేవాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం కృష్ణ ఫాంహౌస్‌లో ఉంటున్న భార్య వద్దకు వచ్చాడు. సాయంత్రం బాడీగార్డు బాబా ఫాంహౌస్‌కు చేరుకుని కేకేతో టీ తాగారు. కృష్ణ టీ కప్పును టేబుల్‌పై పెడుతున్న సమయంలో బాబా గట్టిగా అరిచారు. ఏమైంది బాబా అలా అరుస్తున్నావు అంటూ కృష్ణ అతని దగ్గరకు వచ్చాడు. ఆ సమయంలో బాబా తన యజమాని కృష్ణ చేతులను వెనక్కి లాగి పట్టుకున్నాడు. వెంటనే ఫాంహౌస్‌ బయట కారులో ఉన్న ఇద్దరు వ్యక్తులు లోపలికి వచ్చి కృష్ణ గొంతుపై కత్తితో విచక్షణా రహితంగా దాడి చేసి అక్కడి నుంచి కారులో పరారయ్యారు. రక్తపు మడుగులో కొట్టుమిట్టాడుతున్న కృష్ణను చికిత్స నిమిత్తం వెంటనే పావని శంషాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న ఏసీపీ రంగస్వామి, పట్టణ సీఐ విజయ్‌కుమార్‌, ఎస్‌ఐ శరత్‌కుమార్‌లు ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు



ఘటనా స్థలి వద్ద మాట్లాడుతున్న ఏసీపీ రంగస్వామి

హత్యతోనే కృష్ణ వెలుగులోకి

హైదర్‌షా కోట్‌లో నివాసం ఉండే కృష్ణ గత 30 ఏళ్ల క్రితం ఓ రేషన్‌ డీలర్‌ను హత్య చేసిన ఘటనలో నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. అప్పటి నుంచి చిన్న చిన్న గొడవలు, భూ తగాదాల్లో కృష్ణ తలదూర్చి అందరినీ బెదిరిస్తూ వెలుగులోకి వచ్చాడు. అప్పటి వరకు ఇతరుల వద్ద పని చేసిన కృష్ణ ఆ తర్వాత తానే స్వయంగా రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం ప్రారంభించాడు. ఇలా కోట్లాది రూపాయలు సంపాదించిన బాగా ఎదిగాడు. ఓ హత్య చేసి బెదిరింపులకు పాల్పడుతూ ఎదిగిన కృష్ణ.. మరొకరి చేతిలో హత్యకు గురి కావడం చర్చనీయాంశమైంది.

హత్యపై అనేక అనుమానాలు

కృష్ణ హత్యపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం, భూ తగాదాలు హత్యకు దారి తీశాయా లేక.. ఆర్థిక లావాదేవీలు ఏమైనా ఉన్నాయా..? అనే వివరాలు తెలియాల్సి ఉంది. లేదా మొదటి భార్యకు సంబంధించిన వారెవరైనా ఈ హత్యకు పాల్పడ్డారా లేక కృష్ణతో రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తున్న వారు బాబాను పావుగా వాడుకొని ఈ దురాఘాతానికి పాల్పడ్డారా..? తెలియడం లేదు.

పక్కా స్కెచ్‌

బాబా గతంలో ఏడాది పాటు కమ్మరి కృష్ణ వద్ద అంగరక్షకుడిగా పని చేశాడు. అతనికి సంబంధించిన పనులను బాబానే చూసుకునే వాడు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగింది. కొద్ది నెలల క్రితం కృష్ణ బాబాను పనిలో నుంచి తొలగించాడు. పది రోజుల క్రితం కృష్ణ వద్దకు వచ్చిన బాబా తన కుటుంబం గడవడం లేదని, పనిలో పెట్టుకోవాలని ప్రాధేయపడ్డాడు. దీంతో కృష్ణ అతన్ని పనిలో చేర్చుకున్నాడు. ఈ క్రమంలో పక్కా ప్లాన్‌ ప్రకారం బాబా తన యజమానిని దారుణంగా హతమార్చాడు. హత్య చేసిన అనంతరం బాబా శంషాబాద్‌లో పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

క్లుప్తంగా

ఉరేసుకొని రైతు ఆత్మహత్య


బాలరాజు మృతదేహం

కేశంపేట: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ రైతు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని దత్తాయపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యార బాలరాజు(58) వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. కొద్ది రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది బుధవారం గ్రామ శివారులో తన పొలంలో బా లరాజు చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పా ల్పడ్డారు. ఇదే విషయమై మృతుడి భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు. మృతుడికి ముగ్గురు ఆడపిల్లలు ఉండగా ఇద్దరి పెళ్లిలు చేసినట్లు గ్రామస్తులు తెలిపారు.

గునుగల్‌లో సర్వీస్ వైర్ల చోరీ

యాచారం: మండల పరిధిలోని గునుగల్ గ్రామంలో వ్యవసాయ బోరు మోటార్ల సర్వీస్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన 15 మంది రైతులకు చెందిన వ్యవసాయ బావుల వద్ద మంగళవారం రాత్రి రూ.2 లక్షలకు పైగా విలువ జేసే సర్వీస్ వైర్లను కత్తిరించి చోరీకి పాల్పడ్డారు. రోజు మాదిరిగానే బుధవారం రైతులు వ్యవసాయ బావుల వద్దకు వెళ్లి చూడగా బోరు మోటార్ల వద్ద ఉన్న సర్వీస్ వైర్లు కత్తిరించి ఉన్నాయి. బాధిత రైతులు యాచారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు రోజుల కిందనే గడ్డమల్లయ్యగూడ గ్రామంలో 20 మంది రైతులకు చెందిన వ్యవసాయ బావుల వద్ద ఉన్న బోరుమోటార్ల సర్వీస్ వైర్లను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాంమోహన్‌రావు తదితరులు

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్‌రావు

షాద్‌నగర్: భవన నిర్మాణ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్‌రావు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని సంఘం నాయకులు అడ్డా వద్ద కూలీలతో సమావేశం అయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాంమోహన్‌రావు మాట్లాడుతూ.. పొట్టకూటి కోసం రెక్కలు ముక్కలు చేసుకొని ఎంతో కార్మికులు కష్టించి పని చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమానికి ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. పని ప్రదేశంలో ప్రమాద మరణానికి రూ.ఆరు లక్షల నుంచి రూ.పది లక్షల చెల్లించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమించాలని అన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం ప్రకటించిన విధంగా కార్మికులకు మోటార్ సైకిళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చాలా మంది కార్మికులకు ప్రభుత్వం నుంచి నష్టపరిహారం రావాల్సి ఉందని వాటిని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవికుమార్, రాజునాయక్, శ్యాం, మల్లేష్, శ్రీరాములు, రమేష్, గోపాల్, యాదయ్య, చెన్నయ్య, శ్రీశైలం, విజయ్‌కుమార్, వెంకటేష్, రాములు, పాండు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలో ప్రమాదం.. కార్మికుడి మృతి


రవిచంద్ర (ఫైల్)

నందిగామ: పొట్టకూటి కోసం కర్మాగారంలో చెమటను చిందించిన ఓ కార్మికుడిని లిఫ్ట్ రూపంలో మృత్యువు కబళించింది. భూం లిఫ్ట్ వాహనం(స్ట్రీట్ లైట్ల మరమ్మతుల కోసం వాడే లిఫ్ట్ వాహనం)కు మరమ్మతులు చేస్తుండగా అకస్మాత్తుగా లిఫ్ట్ కింద పడిపోవడంతో యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలోని మేకగూడ శివారులోని నాట్కో పరిశ్రమలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై గోపాల కృష్ణ కథనం ప్రకారం.. కొత్తూరు మండలం పెంజర్ల గ్రామానికి చెందిన అర్బాజ్ కొంత కాలంగా నాట్కో పరిశ్రమలో భూం లిఫ్ట్ వాహనంతో పైన ఉన్న లైట్లకు మరమ్మతులు, క్లీనింగ్ పనులను కాంట్రాక్ట్ పద్ధతిన చేస్తుంటాడు. ఆయనతో పాటు పెంజర్ల గ్రామానికే చెందిన రవిచంద్ర(19), మహేష్ సైతం ఆ వాహనంపైనే ఆపరేటర్లు, సహాయకులుగా పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం లిఫ్ట్ వాహనానికి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా పైనుంచి ప్రమాదవశాత్తు రవిచంద్ర, మహేష్‌లపై పడింది. దీంతో రవిచంద్రకు తీవ్ర గాయాలు కాగా, మహేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. రవిచంద్రను ఉస్మానియా ఆస్పత్రికి తరలించడంతో చికిత్స పొందుతూ అక్కడ మృతి చెందాడు. మహేష్‌ను ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

నిధుల మంజూరు హర్షణీయం

రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి


చేవెళ్లలో మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి తదితరులు

చేవెళ్ల: ముడిమ్యాల–మల్కాపూర్ ఫారెస్ట్ అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయటం హర్షణీయమని రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడు చింపుల సత్యనారాయణరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యుడిగా ఫారెస్ట్ డిపార్టుమెంట్‌కు మండలంలో ఉన్న ముడిమ్యాల అటవీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని కోరానన్నారు. వెంటనే స్పందించి అటవీ ప్రాంతంలో చెట్లు పెంచి చుట్టూ కంచె ఏర్పాటు చేసి పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని చెప్పారన్నారు. దీనికి ఫారెస్ట్ డిపార్టుమెంట్ రూ.13 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. నేషనల్ హైవే అథారిటీ నుంచి కూడా ఫారెస్ట్ అభివృద్ధికి రూ.13కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు.

నెలాఖరులోగా విస్తరణ పనులు

ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులు ఈ నెలాఖరులోగా ప్రారంభం కానున్నాయని తెలిపారు. ఈ రోడ్డుకు ఇప్పటివరకు ఉన్న అడ్డంకులు తొలగి పోయాయన్నారు. కాంట్రాక్టర్ల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యంతో గత ప్రభుత్వంలో పనులు ఆలస్యమయ్యాయన్నారు. కానీ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ తీసుకొని ఈ పనులను వేగంగా పూర్తిచేయించాలని చూడటం సంతోషకరమన్నారు. సమావేశంలో డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి, నాయకులు ఆగిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రాములు, గోపాల్‌రెడ్డి, మధుసుదన్‌గుప్తా, రాములు, భీమయ్య, శ్రీను, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, ప్రభాకర్, జనార్దన్, నరేందర్, పాండు, బాలయ్య, మానిక్యం తదితరులు ఉన్నారు.

రైతు భరోసాతో మేలు


రైతులతో భారతీయ కిసాన్‌సంఘ్ నాయకులు

భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డి

కడ్తాల్: రైతుభరోసా పథకం రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు ఉపయుక్తంగా ఉంటుందని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రాజిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు గజేందర్‌గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని చల్లంపల్లి గ్రామంలో భారతీయ కిసాన్‌సంఘ్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యవసాయ పంటలకు సకాలంలో పెట్టుబడులు అందక రైతాంగం ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకుని ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆపత్కాల పరిస్థితుల్లో ప్రభుత్వం రైతుభరోసా తేవడం సంతోషించాల్సిన విషయమన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల ద్వారా రైతు ఆదాయాన్ని పెంచుకుని, జీడీపీ పెంచడంలో రైతులది ప్రధాన పాత్ర అన్నారు. తక్కువ, మధ్యస్థ, ఎక్కువ భూమి కలిగిన రైతులందరికీ పెట్టుబడి సాయం అవసరమని గుర్తు చేశారు. ప్రతి ఎకరాకు రైతుభరోసా అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అనంతరం భారతీయ కిసాన్‌సంఘ్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన చల్లా అశోక్‌రెడ్డి ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో నాయకులు తీగల శ్రీధర్‌రెడ్డి, చల్లా పవన్‌రెడ్డి, అంజయ్య, రామకృష్ణ, మల్లేశ్, మహేశ్, రామిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, రామిరెడ్డి, జంగయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

క్వారీలో పడి కార్మికుడి దుర్మరణం

కొందుర్గు: క్వారీలో డ్రిల్లింగ్ చేసే క్రమంలో ప్రమాదశాత్తు కాలుజారి గోతిలో పడి కార్మికుడు దుర్మరణం పాలైన సంఘటన కొందుర్గు మినరల్స్‌లో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. నల్లగొండ జిల్లా శాలి గౌరారం మండలం గురజాల గ్రామానికి చెందిన రూపని రమ, రవి(40) దంపతులు కంప్రెషర్ డ్రిల్లింగ్ పనులు చేస్తూ కొందుర్గు గ్రామంలో అద్దె ఇంట్లో ఉంటూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు. మంగళవారం కొందుర్గు మినరల్స్‌లో డ్రిల్లింగ్ చేయడానికి రవి వెళ్లారు. పనిచేసే ప్రదేశంలో ఎలాంటి రక్షణ లేపోవడంతో 70 ఫీట్ల లోతైన గుంతలో డ్రిల్లింగ్ చేస్తూ రవి జారి పడి మృతి చెందారు. క్వారీ నిర్వాహకులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. కాగా మృతుడి భార్య బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై కృష్ణయ్య తెలిపారు.

హుండీలను ధ్వంసం చేసి.. లూటీ


ఘటనాస్థలిని పరిశీలిస్తున్న పోలీసులు

కేశంపేట: కేశంపేట గ్రామంలో మంగళవారం రాత్రి దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామ సమీపంలోని దవళగిరి వేంకటేశ్వరస్వామి, వీరబ్రహ్మేంద్రస్వామితో పాటు మైసమ్మ ఆలయాల్లో ఉన్న హుండీలను ధ్వంసం చేసి నగదును దోచుకెళ్లారు. అలాగే దవళగిరి వేంకటేశ్వరస్వామి దేవాలయంలో ఉన్న గరుడ వాహనం ఆనవాళ్లను ఛిద్రం చేశారు. మూడు హుండీల్లో దాదాపు రూ.50 వేల వరకు నగదును దుండగులు దోచుకెళ్లినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు బుధవారం వీరబ్రహ్మేంద్ర స్వామి దేవాలయ పూజారి దిద్యాల బ్రహ్మచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజ్‌కుమార్ తెలిపారు.

8 వేల లీటర్ల మద్యం బాటిళ్లు ధ్వంసం

జేసీబీతో తొక్కించిన పోలీసులు


మొయినాబాద్ ఠాణా ఆవరణలో ధ్వంసం చేసిన మద్యం సీసాలు

మొయినాబాద్: అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా బెల్టుషాపులు, ఫాంహౌస్‌లలో పట్టుకున్న మద్యం బాటిళ్లను పోలీసులు ధ్వంసం చేశారు. రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని 9 పోలీస్ స్టేషన్లలో నమోదైన 333 కేసుల్లో పట్టుకున్న మద్యం బాటిళ్లను బుధవారం ల్యాండ్ ఆర్డర్ ఎక్సైజ్ పోలీసులు మొయినాబాద్ పీఎస్ ఆవరణలో 8,551 లీటర్ల మద్యం, బీరు బాటిళ్లను జేసీబీతో ధ్వంసం చేశారు. మొయినాబాద్ పీఎస్ పరిధిలో 3,028 లీటర్లు, నార్సింగి పరిధిలో 570 లీటర్లు, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలో 765.38 లీటర్లు, శంకర్‌పల్లి 1,200.34 లీటర్లు, మోకిల 888.34 లీటర్లు, చేవెళ్ల 1,140 లీటర్ల మద్యం బాటిళ్లు పట్టుకున్నారు. వీటిని మొయినాబాద్ పీఎస్ ఆవరణకు తరలించి రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, అడిషనల్ డీసీపీ విజయ్‌కుమార్, ఆబ్కారీ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ ప్రదీప్‌ల సమక్షంలో ధ్వంసం చేశారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సైలు సిబ్బంది ఉన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం


బీడీఎల్ సమీపంలో వాహనాల తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

శంకర్‌పల్లి: డ్రైవింగ్ లైసెన్స్‌లు, నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలు నడిపితే వాహనదారులపై చర్యలు తప్పవని చేవెళ్ల ట్రాఫిక్ సీఐ వెంకటేశం హెచ్చరించారు. మండలంలోని బీడీఎల్ సమీపంలో బుధవారం డ్రైవింగ్ లైసెన్స్, నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా తనిఖీ చేసి లైసెన్స్‌లు, నంబర్‌ప్లేట్ లేని 10 వాహనాలను గుర్తించి సీజ్ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. ప్రతిఒక్కరు ట్రాఫిక్ రూల్స్‌ను పాటించాలన్నారు. నియమ నిబంధనలను ఉల్లంఘించిన వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాల్సిందేనని చెప్పారు. రూల్స్‌ను పాటించి ప్రమాదాల నివారణకు, పోలీసులకు సహకరించాలన్నారు. ఈ తనిఖీలో ట్రాఫిక్ ఎస్ఐ విఠల్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఫిర్యాదులు... ట్విస్టులు

- మరోసారి రాజ్‌తరుణ్‌పై లావణ్య ఫిర్యాదు
- పెళ్లి చేసుకున్నారు.. అబార్షన్ కూడా చేయించారని ఆరోపణ
- దీంతో సినీహీరోపై కేసులు నమోదు

మణికొండ/బంజారాహిల్స్: ఆరోపణలు, ప్రత్యారోపణలు, పరస్పర కేసుల తరుణంలో సినీహీరో రాజ్‌తరుణ్ వ్యవహారం సినిమా స్టైల్‌లో అనేక మలుపులు తిరుగుతోంది. పోలీసులు ఇరువర్గాలను పిలిచి నిజానిజాలు నిగ్గుతేల్చే పనిలో నిమగ్నమయ్యారు. రాజ్‌తరుణతో 11 ఏళ్ల లివింగ్ రిలేషన్‌లో ఉన్నానని, ఇప్పుడు మరో హీరోయిన్ మాల్వీ మల్హోత్రా మోజులో పడి తన వద్దకు రావటంలేదని, మాల్వీ మల్హోత్రా సోదరుడు మయాంక్ తనను చంపుతానని బెదిరించాడని ఇదివరకే ఫిర్యాదు చేసిన లావణ్య మంగళవారంరాత్రి నార్సింగి పోలీస్‌స్టేషన్‌లో మరో ఫిర్యాదు చేసింది. ముందుగా చేసిన ఫిర్యాదుకు ఆధారాలను చూపాలని పోలీసులు ఆమెకు నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. దాంతో ఆమె తన న్యాయవాదితో కలిసి ఆధారాలను, 175 ఫొటోలు, స్క్రీన్ చాట్‌లు, వీడియోలు, కాల్ రికార్డ్‌లు అందజేసినట్టు తెలుస్తోంది. రాజ్‌తరుణ్‌తో తనక 10 ఏళ్ల క్రితమే గచ్చిబౌలిలోని ఎల్లమ్మగుడిలో వివాహమైందని, తనకు గర్భం రావటంతో ఓ ఆస్పత్రిలో అబార్షన్ కూడా చేయించారని తెలిపింది. రాజ్‌తరుణ్‌కు గతంలోనూ మరికొంత మంది మహిళలతో ఎఫైర్‌లు ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొంది. తాను అన్విక పేరుతో పాస్‌పోర్టు పొందానని, తామిద్దరం కలిసి ఇదివరకు విదేశాలకు కూడా వెళ్లామని తెలిపింది. ఆమె ఇచ్చిన ఫిర్యాదు, ఆధారాలను పరిశీలించి రాజ్‌తరుణపై కేసులు నమోదు చేసినట్టు నార్సింగి పోలీసులు తెలిపారు. త్వరలోనే రాజ్‌తరుణ్‌ను విచారించి అసలు నిజాలను వెలుగులోకి తెస్తామని పేర్కొన్నారు.

లావణ్యపై మాల్వీ మల్హోత్రా ఫిర్యాదు

లావణ్య అనవసరంగా వివాదంలోకి లాగి తన పరువుకు భంగం కలిగిస్తోందని, తన సోదరుడికి ఇష్టారాజ్యంగా మెసేజ్‌లు పెట్టి బెదిరిస్తోందని హీరోయిన్ మాల్వీ మల్హోత్రా రాయదుర్గం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తనది హిమాచల్‌ప్రదేశ్ అని, తల్లిదండ్రులు అక్కడే ఉంటారని, తాను మాత్రం ముంబైలో ఉంటానని, 'తిరగబడరా స్వామీ'సినిమాలో నటించానని, ఈ సినిమా నిమిత్తమే హైదరాబాద్‌కు వచ్చి స్నేహితురాలి ఇంట్లో ఉంటున్నానని వెల్లడించారు. ఫిర్యాదుపై పో లీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు.

బల్కాపూర్ నాలా చుట్టూ ప్రహరీ: కలెక్టర్

సాక్షి, సిటీబ్యూరో: బల్కాపూర్ నాలా, గ్రేవ్‌యార్డ్ ఆక్రమణకు గురికాకుండా నాలా చుట్టూ గోడ నిర్మించాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. బుధవారం షేక్‌పేట్‌లోని సక్కుబాయి సొసైటీ వద్ద గల నాలాను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జీహెచ్ఎంసీ అధికారులు నాలా వెంట ప్లాంటేషన్, గ్రీనరీతో సుందరీకరణను చేపట్టాలని సూచించారు. రెవెన్యూ ద్వారా అప్పగించిన 1,700 చదరపు గజాల విస్తీర్ణంలో గల గ్రేవ్‌యార్డ్ ప్రహరీ నిర్మించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ, తహసీల్దార్ అనితారెడ్డి, జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ సంపత్, ఏఈ కిషోర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలో మాకు రక్షణ కల్పించాలి

సీఎండీ ముషారఫ్‌కు విద్యుత్ ఉద్యోగుల వినతి

సాక్షి, సిటీబ్యూరో: పాతబస్తీలో విధులు నిర్వహించే విద్యుత్ ఇంజనీర్లకు కనీస రక్షణ లేకుండా పోయిందని, తనిఖీలు, బిల్లుల జారీకి వెళ్లిన సమయంలో కొంతమంది స్థానిక వినియోగదారులు సిబ్బందిపై దాడులకు పాల్పడుతున్నారని తెలంగాణ పవర్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు జేఏసీ ప్రతినిధుల బృందం బుధవారం దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ సీఎండీ ముషారఫ్ ఫారూఖీని కలిసి వినతిపత్రాన్ని అందజేసింది. విద్యుత్ చౌర్యానికి పాల్పడుతూ, సంస్థ నష్టాలకు కారణమవుతున్న వారిని గుర్తించేందుకు వెళ్లిన సిబ్బందిపై దాడులకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాడులకు పాల్పడినవారిని తక్షణమే అరెస్ట్ చేయించాలని, తనిఖీ సిబ్బందికి పోలీసు భద్రత కల్పించాలని కోరారు. ఈ మేరకు ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు తెలిసింది.

పేకాట రాయుళ్ల అరెస్ట్

మీర్‌పేట: పేకాట ఆడుతున్న ఏడుగురిని మీర్‌పేట పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు కథనం ప్రకారం.. జిల్లెలగూడ అర్పితా ఎన్‌క్లేవ్‌లో జూదం ఆడుతున్నట్లు సమాచారం రావడంతో స్థానిక పోలీసులు ఎల్‌బీనగర్ ఎస్ఓటీ సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేశారు. ఇందులో సైదాబాద్‌కు చెందిన గుర్రం వెంకట్‌రెడ్డి, బి.కృష్ణమూర్తి, నాగోలుకు చెందిన ఎస్.ప్రవీణ్‌కుమార్, జి.అనిల్‌రెడ్డి, ధాతూనగర్‌కు చెందిన ఆర్.శ్రీనివాసరావు, హస్తినాపురానికి చెందిన కే.రమేష్‌రెడ్డి, మీర్‌పేట వాసి కరుణాకర్‌రెడ్డిలను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.25,120 నగదు, సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

గంజాయి కేసులో ఐదుగురికి రిమాండ్

అత్తాపూర్: గంజాయిని విక్రయించేందుకు సిద్ధమైన ఐదుగురు యువకులను అరెస్ట్ చేసి అత్తాపూర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్ఓటీ పోలీసులు, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నిమ్మల వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రానికి చెందిన ముగ్గురు యువకులు, జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన ఇద్దరు యువకులు జీవనోపాధి నిమిత్తం నగరానికి వచ్చి ఓ బిర్యాని హోటల్‌లో పనిచేస్తున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలన్న దురుద్దేశంతో ఇతర ప్రాంతాల్లో రెండు కిలోల గంజాయిని కొనుగోలు చేశారు. అత్తాపూర్ ముష్కిమహల్ పాడుబడిన పురాతన బంగ్లాను ఎంచుకుని చిన్న, చిన్న ప్యాకెట్లుగా చేసి రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో విక్రయించేందుకు సిద్ధమైయ్యారు. విషయం తెలుసుకున్న అత్తాపూర్, రాజేంద్రనగర్ ఎస్ఓటీ పోలీసులు ముష్కిమహల్‌లో సోదాలు జరిపారు. తప్పించుకునే ప్రయత్నం చేయగా అప్పటికే పోలీసులు చుట్టుముట్టారు. రెండు కిలోల గంజాయితో పాటు 5 సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు.

ఎమ్మెల్యేపై ఫిర్యాదు

శంషాబాద్: రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ తనను వేధిస్తున్నాడని పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ బుధవారం ఢిల్లీలో జాతీయ ఎస్సీ కమిషనర్ చైర్మన్ కిషోర్ మక్వానాకు ఫిర్యాదు చేశారు. సాతంరాయిలోని సర్వే నంబరు 17లో తన తండ్రి జంగయ్య 12 ఎకరాల భూమిని సాగు చేశారన్నారు. దీనిపై చట్టబద్ధమైన ఆధారాలతో తాము అనుభవించిన భూమిలో ఎమ్మెల్యే అక్రమంగా ప్రవేశించేందుకు ఓ కాంట్రాక్టరుతో నిర్మాణం చేయించే ప్రయత్నం చేశారన్నారు.